ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు

3

సోమవారం 27 జనవరి 2025



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాష్ట్ర, జిల్లా ప్రగతికి కృషి చేద్దాం

- అధికారులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపు
- ఘనంగా గణతంత్ర వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



జాతీయ జెండా ఎగురవేసి గౌరవవందనం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, వారి అడుగు జాడల్లో నడుస్తూ దేశ, రాష్ట్ర, జిల్లా ప్రగతికి బాధ్యతగా కృషి చేద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. రాయచోటిలోని పోలీసుపెరేడ్ గ్రౌండులో ఆదివారం జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మొదటగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 2047వ సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్ది రాష్ట్ర ప్రజలందరూ సుసంపన్నంగా, ఆనందంగా జీవించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా అందరం సమన్వయంతో పనిచేద్దామని తెలిపారు. అన్నమయ్య జిల్లా ప్రతి సంవత్సరం 15 శాతం వృద్ధి రేటు సాధించే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన 9 వేల 50 అర్జీల్లో 6 వేల 975 సమస్యలను నాణ్యతగా పరిష్కరించాం. మిగిలిన వాటిని కూడా నిర్ణీతకాల వ్యవధిలో సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రెవెన్యూ సదస్సులు

రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించి ఇప్పటి వరకు 4,082 అర్జీలను పరిష్కరించాం. ఈ కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్దీత కాలపరిమితిలోగా వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

అన్నా క్యాంటీన్లు

నిరుపేదల, కూలినాలి చేసుకునేవారు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతోనే ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించింది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో అన్నా క్యాంటీన్లను ప్రారంభించి 5 రూపాయలకే రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తున్నట్లు తెలిపారు.

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

ఆరోగ్యం ద్వారా అభివృద్ధి-పరిశుభ్రత ద్వారా ప్రగతి అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం. నూతన సంవత్సరం-శుభ్రతతో ప్రారంభిద్దాం అనే నినాదంతో ఈ జనవరి మాసంలో జిల్లా అంతా స్వచ్ఛత కార్యక్రమాలను అమలు చేస్తున్నాము. ప్రతి నెల ఒక్కొక్క నినాదంతో స్వచ్ఛత కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తాం. ఇకపై ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించి స్వర్ణ ఆంధ్రకు కృషి చేయాలి.

ప్రతినెలా ఠంచన్‌గా పింఛన్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో 2 లక్షల 18 వేల 900 మందికి 93 కోట్ల 60 లక్షల రూపాయలను ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 6 గంటలకే పంపిణీ చేస్తున్నాము. బ్యాంకు లింకేజీ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘ సభ్యులు తమ జీవనోపాధులు మెరుగుపర్చుకోవడానికి ఇప్పటి వరకు 8 వేల 956 స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 934 కోట్ల రూపాయలు బ్యాంకు రుణాలు అందించాం. మహిళలు లక్షాధికారులు కావాలన్నది ప్రభుత్వ ఆలోచన, ఇందుకు మహిళలు నాయకత్వం వహించే విధంగా సంస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఇప్పటి వరకు 3,420 మందికి రూ.51 కోట్ల వ్యక్తిగత రుణాలు మహిళలకు అందచేశాము.

పల్లెపండుగ

ప్రభుత్వం 2024 అక్టోబరు 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. జిల్లాలోని 501 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసిన మేరకు పల్లె పండుగ కార్యక్రమం కింద ఉపాధి హామీ నిధులతో మొదటి విడతగా దాదాపు 64 కోట్ల రూపాయలతో 841 పనులను మంజూరు చేశాము. వీటిలో 618 పనుల ద్వారా 86 కిలోమీటర్ల మేర గ్రామాల్లో సీసీ, బీటీ, డబ్ల్యుబిఎం రహదారులు, ప్రహరీ గోడలు పూర్తి చేశాము.. రెండో విడతగా 24 కోట్ల 72 లక్షల రూపాయలతో గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణం కొరకు 408 పనులు మంజూరు చేశాం. ఇవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నవి. ఉపాధి హామీ నిధులతో జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి పరిచే ఉద్దేశ్యంతో రహదారుల నిర్మాణానికి 39 పనులకు గానూ 20 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 9 పనులు పూర్తి కాగా మిగిలినవి పురోగతిలో ఉన్నట్లు వివరించారు. రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చి మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంతల రహిత రోడ్ల కార్యక్రమం నవంబరు 2న జిల్లాలో మొదలైంది. ఇందుకు జిల్లాలో 1444 కిలోమీటర్లను గుంతలు లేని రహదారులుగా మార్చేందుకు 16 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది.

అర్హులందరికీ దీపం-2

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు దీపావళి కానుకగా దీపం-2 పథకాన్ని నవంబరు నుంచి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 21 కోట్ల 46 లక్షల రూపాయలు సబ్సిడీతో 2 లక్షల 66 వేల 623 మంది వినియోగదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశాము. జిల్లాలో 5 లక్షల 4 వేల మంది తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతినెలా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నాం.

లాభసాటిగా వ్యవసాయం

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుల ముఖాల్లో ఆనందాలు చూడాలన్నదే ప్రభుత్వ ఆశయం. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి రైతులకు ఆదాయం పెంచేందుకు ప్రకృతి సేద్యాన్ని, శాస్త్రీయ వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నాం. పీఎం కిసాన్ పథకం ద్వారా లక్ష 77 వేల మంది రైతుల ఖాతాలకు రూ.70 కోట్లు జమ చేశాము. ఉద్యానవన శాఖ ద్వారా వివిధ పథకాల కింద ఈ ఏడాది 10.18 కోట్ల రూపాయల మేర ఆర్థిక ప్రణాళికతో జిల్లాలో ఉద్యాన రైతులకు చేయూతనివ్వడానికి వివిధ పథకాలను అమలు చేస్తున్నాం.

జలవనరులు

జిల్లాలో మేజర్ ప్రాజక్టు హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు కింద 56 కిలోమీటర్లు ప్రధాన కాలువ, 6 బ్రాంచి కాలువలు, 2బాలెన్సింగ్ రిజర్వాయర్ల కింద 1,55,350 ఎకరాల ఆయకట్టును స్థిరికరించాము. దాదాపు 90 శాతం పని పూర్తి కావచ్చింది. పుంగనూరు బ్రాంచి కాలువకు 485 కోట్ల రూపాయలతో లైనింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నాం. మీడియం ప్రాజెక్టు వెలిగల్లు రిజర్వాయర్ కింద 24 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు కుడికాలువ పునరుద్ధరణకు రూ.11 కోట్లతో పనులు జరుగుతున్నాయి. అన్నమయ్య రిజర్వాయర్ ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు రూ.820 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించాం. పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణకు పనులు 72 కోట్ల రూపాయలతో పూర్తి కావస్తున్నాయి. చిన్నమండెం లిఫ్టు స్కీం ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నుంచి 43 చెరువులకు నీళ్లివ్వడానికి 15 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయి.

పేదలందరికీ ఇళ్లు

ఇళ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ 2029వ సంవత్సరం నాటికి ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇకపై నూతనంగా మంజూరు చేసే ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.4.30 లక్షలు లబ్ధిదారులకు అందిస్తాం. ఇందుకు మన ప్రభుత్వం ద్వారా అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వనున్నాం. ప్రస్తుతం జిల్లాలో 332 పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్ హౌసింగ్ కాలనీల్లో 1432 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన 79,721 గృహ నిర్మాణాల్లో ఇప్పటికే 37,366 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి.

విద్యుత్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు







ఆకట్టుకున్న శకటాలు

జిల్లాలో 515 వ్యవసాయ ఫీడర్స్ ద్వారా ఒక లక్షా 34 వేల 336 వ్యవసాయ పంపు సెట్లకు పగటి పూట 9 గంటలు నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. జిల్లాలో ప్రతి పల్లెకు 24 గంటలకు నితరం 3 ఫేసుల విద్యుత్ సరఫరాకు 800 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించాము. పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన పథకం ద్వారా జిల్లాలో వచ్చే 3 సంవత్సరాల్లో 20 వేల గృహాలకు సోలార్ రూఫ్ టాప్ సిస్టం ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

రాయచోటి పట్టణ అభివృద్ధి

జిల్లా కేంద్రంగా ఏర్పడిన రాయచోటి పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాం. రాయచోటిలో చేపట్టిన క్రికెట్ స్టేడియం, శిల్పారామం, నగరవనం నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి, జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటున్నాం. కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాధరెడ్డి, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిధియాదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవో నాగభూషణంతో పాటు పలువురు రెవెన్యూ ఉద్యోగులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్, తదితరులు





గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నృత్యంలో ప్రథమ బహుమతి పొందిన రాయచోటి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు

ఢిల్లీ గణతంత్ర ఉత్సవాల్లో సర్పంచ్ సంయుక్త



ఢిల్లీలో గణతంత్ర ఉత్సవాల్లో తోటి సర్పంచులతో సంయుక్త

రైల్వేకోడూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ సర్పంచ్ కారుమంచి సంయుక్త ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లా సర్పంచ్‌లు గణతంత్ర ఉత్సవాలకు వచ్చారన్నారు. కేంద్ర మంత్రుల చేత అవార్డు తీసుకోవడం, పలు రకాల విషయాలు తెలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రామస్థుల సహకారం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల కృషి వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

గవర్నర్ తేనీటి విందుకు తహురా సమర్

మదనపల్లె టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇచ్చిన అట్ హోమ్ (తేనీటి విందు) కార్యక్రమానికి మదనపల్లె విద్యార్థిని తహూర సమర్ హాజరయ్యారు. ప్రతి ఏటా సీఎం, మంత్రులతో పాటు పలు రంగాల్లో విశిష్టత చూపించిన వ్యక్తులను రాజ్‌భవన్‌లో నిర్వహించే అట్ హోమ్ విందుకు అహ్వానిస్తారు. ఇందులో భాగంగా మదనపల్లె ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న తహూర సమర్‌కు రాజ్‌భవన్ నుంచి అహ్వానం అందింది. ఈ క్రమంలో ఆదివారం రాజ్‌భవన్‌కు వెళ్లిన తహూర సమర్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానించి ఆప్యాయంగా మాట్లాడారు. ఉన్నత చదువులతో రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గవర్నర్ విందుకు హాజరైన తహూర సమర్, ఆమె తండ్రి షేక్ రియాజ్అలి ఆనందం వ్యక్తం చేశారు.

మదనపల్లె ఎక్సైజ్ అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు







ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పీసీ దామోదర్‌రెడ్డి, హెచ్‌సీ వేమారెడ్డి, సీఐ సత్యశ్రీనివాస్

మదనపల్లె టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ముగ్గురికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్ శర్మ నుంచి మదనపల్లె ఈఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్, ఈఎస్‌టీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పి.వేమారెడ్డి, మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పీసీ జె.దామోదర్‌రెడ్డి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో వీరు చూపిన ప్రతిభకు ఎక్సైజ్‌శాఖ ఈ ప్రశంసాపత్రాలు అందచేసింది.

వైసీపీ నాయకుడి కుమారుడిపై పోక్సో కేసు

- విద్యార్థినిపై అత్యాచారం
- పరారీలో నిందితుడు

కలికిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు పంచాయతీ గడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు జుబేర్ అహ్మద్ కుమారుడు జునేద్ అహ్మద్‌పై శనివారం రాత్రి కలికిరి పోలీసుస్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. కలికిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థిని (16) మండలంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆ విద్యార్థిని అమ్మమ్మ ఆ బాలిక బాగోగులు చూస్తుండేది. కళాశాల హాస్టల్‌లో ఉంటూ సెలవు రోజుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చేది. శుక్రవారం అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో తన కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని సమాచారం అందిందని బాలిక తల్లి శుక్రవారం అర్ధరాత్రి కలికిరి పోలీసులకు ఫోన్ చేసింది. దీంతో అర్ధరాత్రి హడావిడి పడిన పోలీసులు పరిస్థితి విషమించకుండా ఉండేందుకు జిల్లాలోని పోలీసులను అప్రమత్తం చేశారు. ఆ తరువాత రాత్రి 3 గంటలకు తిరిగి ఫోను చేసి తమ కుమార్తె తిరిగి వచ్చేసిందని, గుర్తు తెలియని వ్యక్తులు కారులో నుంచి ఇంటి ముందు దింపేసి వెళ్లిపోయారని తెలిపింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఆ తరువాత బాలిక తల్లి కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గడి గ్రామానికి చెందిన జునేద్ అహ్మద్ (26) అనే యువకుడు (పల్లవోలు పంచాయతీ వైసీపీ నాయకుడు జుబేర్ అహ్మద్ కుమారుడు) ఆగస్టు నుంచి విద్యార్థినిని లైంగికంగా లొంగదీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి అర్ధరాత్రి తన కారులో ఆ విద్యార్థిని ఎక్కించుకుని సమీపంలోని జుబేర్ అహ్మద్ మామిడి తోటలోకి తీసుకెళ్లి తిరిగి ఇంటి వద్ద వదిలేశాడని తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు అందిన విషయం తెలియగానే జునేద్ అహ్మద్ కారుతో సహా పరారయ్యాడని పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ దర్యాప్తు చేస్తున్నారు. మదనపల్లె నుంచి మహిళా ఎస్ఐ రమాదేవి ఆధ్వర్యంలో కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు.



గొల్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదం
- ఇద్దరి మృతి
5

నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగాలి
- సీఆర్పీఎఫ్ డీజీ అనుపమ్ శర్మ
5

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

- రేపు మదనపల్లెలో ఆంధ్రజ్యోతి కార్యక్రమం
- హాజరుకానున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మా అక్షరం మీ ఆయుధం నినాదంతో దశాబ్దాలుగా బాధితుల పక్షాన నిలుస్తున్న ఆంధ్రజ్యోతి ఇప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు వార్తలుగా మలచి వెలుగులోకి తీసుకువస్తున్న ఆంధ్రజ్యోతి, మరొక అడుగు ముందుకు వేసి ఆచరణాత్మక కార్యక్రమం ప్రారంభిస్తోంది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పేరుతో ఆయా ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యల్ని అక్కడి ప్రజలు ప్రజాప్రతినిధులతోనూ, అధికారులతోనూ నివేదించుకునేందుకు ఒక వేదికగా మారుతోంది. నాయకులూ, అధికారులను ప్రజల వద్దకే తీసుకువచ్చి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మదనపల్లెలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం జరుగుతుంది. స్థానిక కదిరిరోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఫంక్షన్‌హాలులో జరిగే సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, జనసేన నేత శ్రీరామరామాంజనేయులుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు హాజరవుతున్నారు. ప్రశాంత్‌నగర్ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వీరి దృష్టికి తీసుకువెళ్లవచ్చు. ఇప్పటికే ఆ ప్రాంతంలోని సమస్యలను ఆంధ్రజ్యోతి ప్రతినిధులు గుర్తించారు. ప్రశాంత్‌నగర్‌లోని పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేవని ప్రజలు చెబుతున్నారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనలతో వీటి పరిష్కారానికి ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలించి ప్రజలకు వివరిస్తారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడపలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది



విశ్వేశ్వరనాయుడు, డీఆర్‌ఓ, కడప | వెండిపతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి | జాన్ ఇర్విన్, కడప ఆర్డీఓ | చంద్రమోహన్, ఆర్డీఓ, బద్వేల్ | సాయిశ్రీ ఆర్డీఓ, జమ్మలమడుగు | చిన్నయ్య ఆర్డీఓ, పులివెందుల | వెంకటపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | ఓబులమ్మ, జడ్పీ సీఈఓ | ఆనందనాయక్, డీఆర్‌డీఏ పీడీ



ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ | ఎ.నాగేశ్వరరావు, డీఏఓ | రాజ్యలక్ష్మి డీపీఓ | నాగరాజు, డీఎంహెచ్ఓ | శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ | వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ | విజయలక్ష్మి, ఆత్మ పీడీ | రాజారత్నం, హౌసింగ్ పీడీ | చాంద్‌బాషా, పరిశ్రమల శాఖ | వై.సురేష్‌రెడ్డి, మెప్మా పీడీ | సరస్వతి, డీడీ సోషల్ వెల్ఫేర్



చాముండేశ్వరి, డీఎస్ఓ | ఎ.సురేష్, ఉపాధి అధికారి | పరిమళ జ్యోతి మార్క్‌ఫెడ్ | బ్రహ్మయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ | జయసింహ, బీసీ కార్పొరేషన్ ఈడీ | సి.సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ | మనోజ్‌రెడ్డి, కడప కమిషనర్ | జీవన్‌చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కలెక్టరేట్ | ఎ.శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | బి.శివరామిరెడ్డి, తహసీల్దార్, కమలాపురం | గంగయ్య, తహసీల్దార్ ప్రొద్దుటూరు



నాగేశ్వరరావు, తహసీల్దార్, సీకేదిన్నె | రాజేంద్రప్రసాద్, మైదుకూరు డీఎస్పీ | వెంకటేశ్వర్లు, జమ్మలమడుగు డీఎస్పీ | వినయ్‌కుమార్‌రెడ్డి, సీఐ, డీసీఆర్‌బీ | ఉలసయ్య, సీఐ, ఆర్‌కే వ్యాలీ | నాగభూషణం, సీఐ, బద్వేలు రూరల్ | మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ | సీతారామిరెడ్డి, సీఐ, రిమ్స్ | శివశంకరనాయక్, సీఐ, సీకేదిన్నె | ఎంవీ ప్రభాకర్‌రావు, సహకార శాఖ అధికారి | ధనుంజయ, డీఆర్‌డీఏ, కడప

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాయచోటిలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది



మేఘస్వరూప్, సబ్ కలెక్టర్, మదనపల్లె | నిదియాదేవి, సబ్‌కలెక్టర్, రాజంపేట | ఎ.శ్రీనివాస్, ఆర్డీవో, రాయచోటి | ఎస్.రమ హెచ్ఎన్ఎస్ఎస్, పీలేరు | అనిల్‌కుమార్ ఫైర్ ఆఫీసర్ | భరత్‌కుమార్ సర్వే ఏడీ | వెంకటరత్నం పీడీ, డ్వామా | టి.తేజస్విని, ఏడీ, ట్రైబల్ వెల్ఫేర్



దయాకర్‌రెడ్డి ఎస్ఈ, పీఆర్ | భరత్, ఎస్ఈ ఇరిగేషన్ | మధుసూదన్‌రావు డీఆర్‌వో | సీహెచ్ పురుషోత్తం డీపీఆర్‌వో | కృష్ణారావు ఇండస్ట్రియల్ ఆఫీసర్ | సుబ్రహ్మణ్యం ఏడీ, మైనింగ్ | జి.ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ | పి.రాము ఆర్ఎం, ఆర్టీసీ | నాగభూషణం ఏడీ, టూరిజం | ఆంజనేయులు ఎల్డీఎం | జవహర్‌బాబు ఎంపీడీవో, గాలివీడు



చంద్రానాయక్ జేడీ, అగ్రికల్చర్ | భరత్‌కుమార్‌రెడ్డి డీఈ ఐఅండ్‌పీఆర్ | రవిచంద్ర ఏడీ, హార్టికల్చర్ | నాగభూషణం ఏవో, కలెక్టరేట్ | విశ్వనాథ్ ఏడీ, ఎండోమెంట్ | నరసింహకుమార్ సూపరింటెండెంట్, కోఆర్డినేషన్ | సహదేవరెడ్డి ఎస్ఈ, ఆర్అండ్‌బీ | ఖలందర్ కలెక్టర్ సీసీ | రవి, వీడియోగ్రాఫర్ ఐఅండ్‌పీఆర్ | ద్రోణాచరణ్ ఫొటోగ్రాఫర్, ఐఅండ్‌పీఆర్ | రాజారమేష్ ఎస్బి సీఐ



కృష్ణమోహన్ డీఎస్పీ, రాయచోటి | చంద్రశేఖర్ సీఐ | కొండారెడ్డి సీఐ, లక్కిరెడ్డిపల్లె | నరసింహారెడ్డి, ఎస్ఐ, రాయచోటి అర్బన్ | వరప్రసాద్, సీఐ, రాయచోటి రూరల్ | జావీద్, ఎస్ఐ, రాయచోటి అర్బన్ | పీర్‌మున్నీ తహసీల్దార్, రాజంపేట | రామాంజనేయులు తహసీల్దార్, రామాపురం | నిర్మలాదేవి, తహసీల్దార్, రామసముద్రం | ధనంజేయులు తహసీల్దార్, నిమ్మనపల్లె | సైకం వంశీ డీటీ, రాయచోటి

కన్నుల పండువగా అట్ హోమ్

కడప కలెక్టరేట్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ బంగ్లా ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో కన్నుల పండువగా అట్ హోమ్ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ శ్రీధర్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, నగరపాలక కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డిలు పాల్గొనగా వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా పురప్రజలకు, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన కళలైన జానపదాలు, భరత నాట్యాలు, జాతీయ భక్తిగీతాలు అట్ హోమ్ కార్యక్రమంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేద్దామన్నారు. విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి రాష్ట్ర అభివృద్ధిలో వైఎస్సార్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులను, వారి కుటుంబ సభ్యులను పలకరించి పరిచయం చేసుకున్నారు. తదనంతరం కళాకారులందరికీ కలెక్టర్, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. అట్ హోమ్ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని ఉల్లాసంగా గడిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అందరినీ ఆకట్టుకున్న వ్యవసాయ, మత్స్యశాఖ శకటం

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు వికసిత్ భారత్-వికసిత ఆంధ్ర-2047 ధైర్య సాహసాల ప్రదర్శన దేశభక్తిని ప్రేరేపించి అందరినీ ఆకట్టుకుంది. సుండుపల్లె కేజీబీవీ పాఠశాల విద్యార్థులు రంగీలా... రంగీలా అంటూ చేసిన బృంద ప్రదర్శన, అదే పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాడుదామా స్వేచ్ఛా గీతం ఎగరేయుదమా జాతీయ పతాకం నృత్యాలు ఆకట్టుకున్నాయి. మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థినులు ఘర్ ఘర్ తరంగా.. హర్ ఘర్ తిరంగా పాటకు చేసిన బృంద నాట్యం హుషారు కలిగించింది. గ్యారంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు పంతం పంతం.. సొంతం సొంతం నీదా నాదా సై అంటూ చేసిన నృత్యం దేశభక్తిని చాటుకున్న సైనికుల త్యాగాలను గుర్తు చేశాయి. కలకడ కేజీబీవీ పాఠశాల వారు జయహో.. జయహో అంటూ చేసిన బృంద ప్రదర్శన, రాయచోటి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు వందేమాతరం పాటకు చేసిన నృత్యాలు హుషారు గొలిపి దేశభక్తిని, సైన్యంలో మహిళలు చూపుతున్న ధైర్యసాహసాలను చాటింది. రాయచోటి గిరిజన గురుకుల పాఠశాలకు ప్రథమ బహుమతి, సుండుపల్లె కేజీబీవీ పాఠశాలకు ద్వితీయ బహుమతి, మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ వారికి తృతీయ బహుమతి, కలికిరి సైనిక్ స్కూల్ పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేశారు.

ఆకట్టుకున్న శకటాలు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా 2047 స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక 10 సూత్రాలపై అవగాహన కలిగించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రగతి శకటాలను ప్రదర్శించాయి. ఇందులో... గ్రేహౌండ్ బృందం, వజ్ర, మైస్ ప్రొటెక్టెడ్ వాహనాలు, రవాణాశాఖ వాహనం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ప్రణాళిక, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గృహ నిర్మాణ సంస్థ వాహనం, పరిశ్రమలు, పర్యాటకశాఖ వాహనం, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వాహనం, అటవీ, జలవనరులశాఖ వాహనం, జిల్లా పంచాయతీశాఖ వాహనం, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వాహనం, ఉద్యాన శాఖ, సూక్ష్మ నీటి సాగు శాఖ వాహనం, రాయచోటి పురపాలక సంఘం వాహనం, సర్వేశాఖ వారి రియల్ టైం గవర్నెన్స్ శకటం, విద్యాశాఖ, సమగ్ర శిక్ష వాహనం, 108, 104 వాహనాలు శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.



ద్వితీయ బహుమతి అందుకుంటున్న కేజీబీవీ పాఠశాల విద్యార్థులు

కడప పోలీసు పరేడ్‌లోని దృశ్యాలు



జెండాతో ఓ చిన్నారి ఆనందోత్సాహం



'ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం'లో భాగంగా ప్లాస్టిక్ భూత వేషధారణలో కడప నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుడు



డ్రోన్ల విన్యాసం

వేధిస్తున్న యూరియా కొరత

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- రైతుల తాకిడి తట్టుకోలేక గోడౌనుకు తాళాలు



ఉప్పరపల్లె గోడౌను వద్ద యూరియా కోసం ఎగబడ్డ రైతులు

చెన్నూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీ సీజనులో వరిసాగు చేసిన రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. వరి సాగుకు అవసరమైన యూరియా లభ్యం కాకపోవడంతో ఉన్నదాంతోనే సరిపెట్టుకోవాలని అధికారులు చెప్పడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులపై మండిపడుతున్నారు. రెండువారాల క్రితం మండలానికి యూరియా మంజూరు కాగా.. వ్యవసాయ సిబ్బంది రైతులు కోరినంత మేర పంపిణీ చేశారు. యూరియా తీసుకున్న రైతులు పలువురు వాటిని ఇళ్లల్లో నిల్వ పెట్టుకోవడం, కొందరు బస్తాపై రూ.60, 70కి అదనంగా అమ్ముకోవడం జరిగింది. దీంతో అవసరం ఉన్న కొందరు రైతులు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, రెండురోజుల క్రితం రెండో దఫా మండలానికి మరో వంద టన్నుల యూరియా మంజూరైంది. ఇది చెన్నూరుకు 20టన్నులు, ఉప్పరపల్లె 20, రామనపల్లెకు 10, బయనపల్లె 10, కనుపర్తి 20, గ్రుర్రంపాడుకు 20 టన్నులు వచ్చింది. అయితే అధికంగా వరి సాగుచేసిన ఉప్పరపల్లె, చిన్నమాచుపల్లె రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఆదివారం ఉదయం ఉప్పరపల్లె గోడౌను వద్ద పలువురు రైతులు తమకు కావాలసిన మేర యూరియా ఇవ్వాలని పట్టుబట్టారు. వ్యవసాయాధికారులు తమ వద్ద ఎంత స్టాకు ఉందో దాన్ని ఎకరాకు బస్తా చొప్పున పంపిణీ చేస్తామనడంతో కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న దఫా ఇష్టానుసారం యూరియా తీసుకెళ్లిన రైతులే ఇప్పుడు మళ్లీ అడుగుతున్నారని.. మా పరిస్థితి ఏంటని, మేం ఎక్కడికి వెళ్లి తెచ్చుకోవాలని రైతులు అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. తమకు అవసరమైన యూరియా ఇవ్వాలని గట్టిగా నిలదీయడంతో సమస్య తీవ్రతరమవుతుందని భావించిన సిబ్బంది గోడౌనుకు తాళాలు వేసి సోమవారం పంపిణీ చేస్తామని చెప్పి వెళ్లారు.



రైతులందరికీ పంపిణీ చేయాలి

మేం అడిగిన మేర యూరియా ఇవ్వడం లేదు. ముందు దఫా ఇష్టానుసారం యూరియా తీసుకెళ్లిన రైతులే మళ్లీ తీసుకెళుతున్నారు. మా పరిస్థితి ఏంటి, వ్యవసాయాధికారులు మా అవసరం గుర్తించి రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలి

- చింతకుంట నారాయణరెడ్డి, రైతు, ఉప్పరపల్లె



ఎక్కువ ధరకు తెచ్చుకుంటున్నాం

అవసరమైన యూరియా అందుబాటులో లేక లావు యూరియాను బయట ఎరువుల అంగళ్లల్లో తెచ్చుకుంటున్నాం, సన్న యూరియా ఇస్తే సర్దుబాటు అవుతుంది. గోడౌన్ వద్ద పరిస్థితి ఘోరంగా ఉంది. ఒక్కొక్కరు పదుల కొద్దీ బస్తాలు తీసుకెళుతున్నారు. మాలాంటి ఎకరా, రెండు ఎకరాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- రామసుబ్బారెడ్డి, రైతు, బుడ్డాయపల్లె

రైతుల అవసరం మేర పంపిణీ చేస్తున్నాం...



రైతులను ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశ్యం కాదు. మండలానికి వంద టన్నులు వచ్చింది. ఆయా గ్రామాల్లో రైతులకు ఏ మేర అవసరమో పంపిణీ చేస్తున్నాం. రైతులు గొడవ పెడితే ఎలా.. పై అధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నాం

- శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి

బ్రహ్మంగారి సన్నిధిలో విదేశీయుల సందడి



బ్రహ్మంగారిమఠం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారి మఠంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని ఆదివారం ఫ్రాన్స్, బెల్జియం దేశాలకు చెందిన 28 మంది విదేశీయులు దర్శించుకున్నారు. వీరికి ముందుగా పోలీసులు స్వాగతం పలికారు. అనంతరం దేవదాయశాఖ సిబ్బంది ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం విదేశీయులు దేవస్థానంలోని బ్రహ్మంగారి నివాస స్థలం, రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్యమఠంను సందర్శించారు. వీరి వెంట కానిస్టేబుల్ సూర్యనారాయణరెడ్డి, దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్ చూడవద్దన్నందుకు బాలిక ఆత్మహత్య



విద్యార్థిని శ్రావ్య మృతదేహం

రాజంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సెల్‌ఫోన్ చూడవద్దన్నందుకు ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. రాజంపేట పట్టణం సాయినగర్‌లో శ్రీనివాసులు ఆచారి, భార్య సిద్దేశ్వరిలు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు మగ పిల్లలు కాగా శ్రావ్యకుమారి మూడో సంతా నం(15). ఆ బాలిక రాజంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. శ్రావ్యకుమారి తరచూ సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తూ ఉండేది. దీంతో ఆమె తల్లి సెల్‌ఫోన్ ఎక్కువగా చూడవద్దని, ఆరోగ్యం దెబ్బతింటుందని గట్టిగా మందలించింది. దీంతో శ్రావ్య మనస్థాపానికి గురై స్నానానికి బాత్‌రూం వెళుతున్నాని చెప్పి బెడ్‌రూంకు గడియ పెట్టుకుని లోనికి వెళ్లింది. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో శ్రావ్య తల్లి కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి బాలికను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఢీ... చిన్నారి దుర్మరణం



చిన్నారి మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు

నిమ్మనపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో రెండేళ్ల చిన్నారి దుర్మరణం చెందింది. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు... కొండయ్యగారిపల్లి వాసి ఉప్పునోళ్ల సురేష్, పవిత్ర రెండో కుమార్తె గానవి(2) ఇంటి వద్ద ఆడుకుంటోంది. అదే గ్రామానికి చెందిన రెడ్డిబాషా ఖాన్ తన ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుతూ వచ్చి చిన్నారి మీద ఎక్కించాడు. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు స్థానిక అస్పత్రికి తరలిం చగా డాక్టర్ పరిశీలించి చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహంతో కుటుంబీకులు, గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. వెంటనే పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ రెడ్డి బాషాఖాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా అస్పత్రికి తరలించారు.

ప్రేమపేరుతో మోసం..యువకుడిపై కేసు

కాశినాయన, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో నమ్మించి మోసం చేసిన చంద్ర అనే యువకుడిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. మండలంలోని బాలాయపల్లె గ్రామానికి చెందిన చంద్ర ఓ యువతిని ప్రేమపేరుతో నమ్మించాడు. పెండ్లిచేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. తీరా ఆయువతి పెండ్లి చేసుకోమని కోరడంతో నిరాకరించాడు. ఈవిషయంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జంగావారిపల్లెలో మహిళ హత్య

కురబలకోట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగావారిపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం రత్నమ్మ(35) అనే మహిళ హత్యకు గురైంది. వివరాలిలా.. మండంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు కర్నాటక రాష్ట్రం చేలూరుకు చెందిన రత్నమ్మ(35)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఎస్సీ కాలనీలో కాపురం ఉంటున్నారు. కాగా వీరివురు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. శనివారం రాత్రి ఇరువురు మద్యం సేవించి గొడవపడ్డారు. దీంతో కోపోద్రేకానికి గురైన శ్రీనివాసులు కర్రతో కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో దొంగతనాలు

ఖాజీపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె, సిద్దాంతిపురం గ్రామాల్లో చోరీలు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున భూమాయపల్లె సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం, సిద్దాంతిపురం రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భీమలింగేశ్వర ఆలయంలో సంవత్సరంలోపు ఎనిమిదిసార్లు దొంగతనం జరుగడంతో భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మోహన్ మాట్లాడుతూ భీమలింగేశ్వర ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, సీసీ పుటేజీని పరిశీలించి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డబ్బులు మాత్రం హుండీలో లేవని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సిద్దవటం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కడప- బద్వేలు రహదారి ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షరాబి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆ రహదారి గుండా వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గమనించి స్థానిక వైద్యశాలకు చికిత్సకు తరలించారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగాలి

- సీఆర్పీఎఫ్ డీజీ అనుపమ్ శర్మ



సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో జాతీయ జెండా వందనం చేస్తున్న అనుపమ్ శర్మ

కలికిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు, భద్రతకు అతి పెద్ద ముప్పుగా పరిణమించిన నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగించాల్సి వుందని స్థానిక సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని ఉగ్రవాద వ్యతిరేక, తీవ్రవాద నిరోధక శిక్షణా సంస్థ (సీఐఏటీ-3) ప్రిన్సిపాల్, డీజీ అనుపమ్ శర్మ పున రుద్ఘాటించారు. ఆదివారం సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో నిర్వ హించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా మొదట ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి పతాక వందనం చేశారు. అంతకు ముందు ప్రాంగణంలోని క్వార్టర్ గార్డ్ వద్ద అమర వీరుల స్మారక చిహ్నానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనుపమ్ శర్మ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వం కోసం సీఆర్పీఎఫ్ అనేక త్యాగాలకు సిద్ధమైందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఆర్పీఎఫ్ సైనికులు పొందిన రాష్ట్రపతి పోలీసు పతకం, శైర్య చక్ర తదితర పురస్కారాల వివరాలను చదివి వినిపించారు. స్థానిక సైనిక పాఠశాలలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

177 పరుగుల ఆధిక్యతలో ఆంధ్రా జట్టు

కడప స్పోర్ట్స్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో శనివారం నుంచి ఆంధ్రా-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అండర్- 23 మల్టీడేస్ నాలుగురోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం ఆంధ్రా జట్టు 177 పరుగుల ఆధిక్యతలో నిలిచింది. వివరాలిలా.... తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. కాగా ఆట రెండవ రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 45.1 ఓవర్లలో కేవలం 119 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 85 పరుగులతో సాగుతోంది.

కువైట్ టు కొండూరు..

- స్నేహితుడి ఇంటికి అరబ్ షేక్



అట్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామానికి ఆదివారం తన స్నేహితుడైన అట్లూరు రాజగోపాల్‌ను చూడడానికి కువైట్ షేక్ అబ్దుల్ రహిమాన్ యూసఫ్ వచ్చారు. రాజగోపాల్ 15 సంవత్సరాలుగా కువైట్‌లో తనతో ఎంతో స్నేహంగా, నమ్మకంగా ఫ్యామిలీలో ఒకడిగా ఉండేవారు. దీంతో స్నేహితుని పిలుపు మేరకు ఇక్కడకు వచ్చినట్లు షేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కొండూరు గ్రామ ప్రజలు తప్పెట్లు, మేళాలతో ఘనస్వాగతం పలికారు.

లాయర్‌పై దాడి...

రైల్వేకోడూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టోల్‌గేటు వద్ద ఉన్న మొబైల్ షాపు దగ్గర లాయర్ కస్తూరి సురేష్ కారు పార్కింగ్ చేస్తుండగా తమ దుకాణం వద్ద పార్కింగ్ చేయవద్దని షాపు యజమాని చెప్పాడు. ఈవిషయమై ఇరువురు ఘర్షణ పడ్డారు. దీంతో షాపు యజమాని బంధువులు లాయర్‌పై దాడి చేశారు. ఈ సంఘటనపై లాయర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.


స్వాతంత్ర్య సమరయోధుడికి ఘన సన్మానం



బాలయల్లారెడ్డిని సన్మానిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్, కమిషనరు మనోజ్‌కుమారరెడ్డి

చెన్నూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, నగర కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు సరస్వతిలు ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి సన్మాంచారు. ఈసందర్భంగా సమరయోధుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు అందరూ స్వేచ్ఛగా అనుభవించాలన్నారు. డీటీ వెంకటరమణ, మండల సర్వేయరు సోమశేఖర్, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ



కడప కలెక్టరేట్ జనవరి 26(ఆంధ్రజ్యోతి) 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆదివారం జాతీయ పతాకాన్ని కలెక్టర్ డాక్టర్ చెరుకూరు శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులను ఎదిరించి ప్రాణ త్యాగాలు చేసి అమరులైన జాతీయనాయకులు, సమర యోధుల త్యాగాలను కలెక్టర్ కొనియాడారు. జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోళ్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం





ప్రమాదంలో మృతి చెందిన ఫయాజ్‌అలీ, మహేంద్ర

బి.కొత్తకోట జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్ బాబు తెలిపిన వివరాల మేరకు....

రాయచోటికి చెందిన ఫయాజ్‌అలీ (30), మహేంద్ర (25) ఓ టెంపోలో పీటీఎం మండలం రంగసముద్రం సమీపంలోని ఓ ఫౌల్ట్రీ ఫారం నుంచి కోళ్లను తీసుకెళ్లేందుకు వచ్చారు. టెంపోలో కోళ్లను వేసుకుని ములకలచెరువు మండలం పెద్దపాళ్యం క్రాస్ మీదుగా హైవేలో ప్రవేశించి అంగళ్ల వైపునకు వెళుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున కోటిరెడ్డిగారిపల్లె వద్ద కదిరి నుంచి మదనపల్లె వైపు వెళుతున్న లారీ నిలిపి ఉండగా దానిని ఢీకొన్నారు. అతి వేగంతో వెళుతున్న టెంపో లారీ వెనుక వైపు నుంచి ఢీకొనడంతో టెంపో ఇరుక్కుపోయింది ఈ ఘటనలో టెంపో నడుపుతున్న డ్రైవర్, సహాయకుడు ఫయాజ్‌అలీ, మహేంద్రలు అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఎక్స్‌కేవటర్ సహాయంతో లారీలో ఇరుక్కుపోయిన టెంపోను విడదీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


రాయచోటి: మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


ఓబులవారిపల్లె: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్


రాజంపేట: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


రాయచోటి: టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పతాకావిష్కరణ చేసి వందనం చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అంతకు ముందు కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు ఎనలేని త్యాగాలు చేశారు. వారందరి ఆశయాలను, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణతో దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమమైన మన రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ నిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కోఆర్డినేషన్ సెక్షన్ అధికారి నరసింహకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో కృషి చేయాలి

రాజంపేట: స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో యువత కృషి చేయాలని సబ్‌కలెక్టర్ నిదియాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే శ్రీధర్ పాల్గొన్నారు. తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎంపీపీ నాగమ్మ, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనరసయ్య, టీడీపీ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: తహసీల్దార్ దైవాధీనం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్‌ఐ శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో మండల కేంద్రంలోని కూడలి వద్ద కూటమి నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.

గాలివీడు: నూలివీడు జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో కానాల ఇరగమ్మ మెమోరియల్ ట్రస్టు చైర్మన్, రిటైర్డ్ లెక్చరర్ భయ్యారెడ్డి ఆటల పోటీ విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. గత సంవత్సరంలో పదవ తరగతిలో పాఠశాల ఫస్ట్ వచ్చిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, లెక్చరర్ యోగేశ్వర్‌రెడ్డి, టీచర్ సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.


సుండుపల్లెలో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు


రాజంపేట:జెండా ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే


నందలూరు : జాతీయ జెండాను ఎగురవేస్తున్న జడ్జి భార్గవి

రైల్వేకోడూరు: టీడీపీ రైల్వేకోడూరు కార్యాలయంలో ముక్కా సాయి వికాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నాయకులు తల్లెం వెంకటరమణారెడ్డి, కొప్పరపు అరవింద్ పాల్గొన్నారు. విజ్‌డమ్ స్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

నందలూరు: జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో జడ్జి కె.భార్గవి, ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు అమర్‌నాథ్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, నందలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మోడపోతుల సుభాషిణి, నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవవందనం చేశారు.

లక్కిరెడ్డిపల్లె: ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, ఎంపీడీవో రెడ్డెయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్రబాబు, సివిల్ జడ్జి ఫైజున్నీసా వారి కార్యాలయాల ఆవరణలో జెండా ఎగురవేశారు.

రామాపురం: తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో జాషువా, ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శ్యామలాదేవి వారివారి కార్యాలయాల ఆవరణల్లో జెండాను ఎగురవేశారు. కుమ్మరపల్లి ఉన్నత పాఠశాలలో ఆటల పోటీ విజేతలకు గ్రామ టీడీపీ నాయకుడు తాతిరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నందలూరు కోటిరెడ్డి, రామాంజనేయరెడ్డి బహుమతులు అందించారు.

సంబేపల్లె: భారతదేశ రాజ్యాంగం ప్రపంచ దేశాలకే స్ఫూర్తి దాయకమని ఎంపీడీవో రామచంద్ర తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్‌ఐ భక్తవత్సలం, ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద త్రివర్ణ పతాకం ఎగురవేసి వందనం చేశారు.

రాజంపేట: నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత సంబావు వెంకటరమణ, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా జెండా ఎగురవేసి వందనం చేశారు. వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

చిన్నమండెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరసింహులు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి గణతంత్ర దినోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ముందు ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్ జెండా ఎగురవేశారు.

రాయచోటిటౌన్: టీడీపీ నాయకులు మౌర్యరెడ్డి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.

పెనగలూరు: తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు, జడ్పీటీసీ యూపీ సుబ్బరాయుడు జాతీయ జెండాను ఎగురవేశారు.

సిద్దవటం: జేఎంజీ కళాశాలలో జైళ్లశాఖ సూపరింటెండెంట్, డిప్యూటీ డైరెక్టర్‌లు కమలాకర్, రమేష్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శాంత విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

నేడు రాజంపేట, నందలూరుల్లో కరెంటు బంద్

రాజంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా రాజంపేట, నందలూరు చుట్టుపక్కల గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఎం. సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు 220కేవీ సబ్‌స్టేషన్‌లో కూడా మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. ఈ మరమ్మతుల కారణంగా రాజంపేట, నందలూరు, కోడూరు ప్రాంతాల్లో రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పబ్లిక్ లీగల్ నోటీస్

మా క్లైయింట్స్ అయిన **శ్రీమతి కె. భాగ్యలక్ష్మి భర్త చిన్నభి,** బాలాజీ నగర్, కడప, **బీగాల రమాదేవి భర్త సుబ్బరాయుడు,** మాధవరం-1, **బీగాల సుబ్బరాయుడు తండ్రి శేషన్న,** మాధవరం-1, సిద్ధవటం మండలం. వీరు ఇచ్చిన సూచనలమేరకు మేము జారీ చేయు పబ్లిక్ నోటీస్ ఏమనగా క్రింద షెడ్యూల్‌లో తెలిపిన ఆస్తి, పైతెలిపిన మాక్లైయింట్స్ ఆధీనంలో ఉన్నది. వారి పేర రెవెన్యూ డాక్యుమెంట్స్‌లో నమోదు కావడం జరిగింది. అయితే భాకరాపేట, సిద్ధవటం మండలం నివాసి అయిన మోపూరి ఓబుల్‌రెడ్డి, మోపూరి లోకేశ్వరరెడ్డి అను వారు పై తెలిపిన షెడ్యూలు ఆస్తిని అక్రమంగా స్వాధీనం చేసుకొనుటకు ప్రయత్నం చేయగా మా క్లైయింట్స్, రాజశ్రీ సిద్ధవటం కోర్టులో **O.S.No. 112/2021**లుగా సివిల్ దావా వేసి **I.A. No. 391/2021**లుగా టెంపరవరీ ఇంజంక్షన్ పొందినారు. సదరు దావా విచారణలో ఉన్నది.

అయితే పై తెలిపిన ఓబుల్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి గార్లు కోర్టులో విచారణలో ఉన్న దావా విషయం మరుగు పరచి భూమిని ఇతరులకు అమ్మకం చేసి అక్రమ లాభం పొందుటకు ప్రయత్నం చేయుచున్నారు. షెడ్యూల్ జాగాపైన, పై తెలిపిన ఓబుల్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి గార్లకు ఎలాంటి హక్కు, స్వాధీనం లేవు. అందువలన పై వారితో షెడ్యూల్ ఆస్తులపైన ఎలాంటి లావాదేవీలు చేయరాదు. అట్టివాటిపై మా క్లైయింట్స్ తీసుకొను లీగల్ చర్యలకు బద్ధులు కాగలరు.

షెడ్యూల్ ప్రాపర్టీ:

ఐటమ్ నెం.1 : వై.యస్.ఆర్.జిల్లా, కడప, సిద్ధవటం మండలం, పెద్దపల్లి గ్రామపొలంలో కనిన భూములు వివరము సర్వేనెం. 999/1 ఎకర 1.50 సెంట్లు.

ఐటమ్ నెం.2 : వై.యస్.ఆర్.జిల్లా, కడప, సిద్ధవటం మండలం, పెద్దపల్లి గ్రామంలో కనిన భూములు వివరము : సర్వేనెం. 999/3 ఎకర. 1.50 సెంట్లు, సర్వేనెం. 999/4 ఎకర 1.50 సెంట్లు, సర్వేనెం. 999/5 ఎకర 1.50 సెంట్లు

శ్రీ యం. సుధాకర్ బాబ్జి, అడ్వకేట్, కడప.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

రాయచోటి టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన దేశ ప్రధాని నరేంద్రమోదీ నేటికీ ఆ హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ రైతు, కార్మిక వర్గాలకు నష్టం కలిగిస్తున్న పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం సీఐటీయూ నాయకులు పీఎల్ నరసింహులు, అబ్బవరం రామాంజులు, ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, నాయకులు చెన్నయ్య, అరుణ, మాధవయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, రైతు సంఘం ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు రమణ, డాక్టర్ కేవీఎస్ నాయుడు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

రాజంపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నియోజకవర్గ మహాసభ ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని కార్మికుల సమస్యలపై నిరంతరం నిర్మాణాత్మకమైన ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడుగా కామ్రేడ్ గాలి చంద్ర, ఉపాధ్యక్షుడుగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఇ.సికిందర్, కోశాధికారిగా సురేష్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి గంగాధర్, సహాయ కార్యదర్శి కామ్రేడ్ మహేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉత్తమ సేవా అవార్డులు


ఉత్తమ అవార్డు అందుకుంటున్న జూనియర్ లైన్‌మన్ ప్రసాద్


సబ్‌కలెక్టర్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న శారద


సిద్దవటం: ప్రశంసా పత్రం అందుకుంటున్న రైతు బాలకృష్ణ

రాయచోటిటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినందుకు ప్రసాద్ అనే జూనియర్ లైన్‌మెన్ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం రాయచోటి లోని విద్యుత్‌శాఖ కార్యాల యంలో అధికారి చంద్రశేఖర్‌రెడ్డి అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీ వెస్ట్ సెక్షన్‌లోని కొత్తపేట, బోస్‌నగర్, కొత్తపేట రామాపురం తదితర ప్రాంతాల్లో ఆయన సేవలను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు అవార్డుతో అభినందించారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లె పంచాయతీ సచివాలయం-3లో పని చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ యు.శారద సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందని భవిష్యత్తులో తన కర్తవ్యాన్ని పట్టుదలతో నిర్వహిస్తానని అన్నారు.

పెనగలూరు: పెనగలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న పద్మభూషన్‌రెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు.

సిద్దవటం: ఒంటిమిట్ట మండల నరసన్నగారిపల్లెకు చెందిన బాలకృష్ణకు కడప అగ్రికల్చర్ ఏడీ నాయక్ ఆదర్శ రైతు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఉద్యోగాలకన్నా వ్యవసాయమే మిన్న అని తెలిపారు.

బహిరంగంగా మాంసం విక్రయాలు

రైల్వేకోడూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణ తంత్ర దినోత్సవం రోజున మాంసం విక్రయించరాదన్న ప్రభుత్వం ఆదేశాలను గాలికి వదిలేసి ఆదివారం రైల్వేకోడూరులో మాంసం, చేపలు తదితరాలు విక్రయించారు. అల్లూరి సీతారామ రాజు విగ్రహం ఎదురుగా, రైల్వేస్టేషన్ రూటు, టోల్‌గేట్ టర్నింగ్, అంకమ్మనగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా మాంసం, చికెన్, చేపల అమ్మకాలు సాగాయి. మద్యం దుకాణాలను శనివారం రాత్రే ఎక్సైజ్ అధికారులు మూయించారు. కాగా, గణతంత్ర దినోత్సవం రోజున మాంసం విక్రయించరాదన్న నిబంధనలపై ఓ మాంసం వ్యాపారిని ప్రశ్నించగా, మీ వల్ల ఏమౌతుందో అది చేసుకోండి అన్నాడు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ అధికారులు దాడులు నిర్వహించి కొన్ని దుకాణాలను మూయించామని వివరించారు.


రైల్వేస్టేషన్ మార్గంలో బహిరంగంగా చేపల అమ్మకాలు

పశువుల వ్యాధులపై అవగాహన అవసరం

రామాపురం, జనవరి26(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం గువ్వలచెరువు పంచాయతీ రెడ్డివారిపల్లెలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 986 ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు మంత్రి మండిపల్లి శుభాకాంక్షలు

రాయచోటిటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని బాలకృష్ణ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి తన నటనతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారని ఆయనను కొనియాడారు.


బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండిపల్లి

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైల్వేకోడూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లెకు చెందిన కారుమంచి జితేంద్ర 2023లో జ్యోతికాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెం దాడు. ఈ యువకుడు జన సేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం కల్గి ఉండడంతో ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ తరపున రూ. 5 లక్షల చెక్కును ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జితేంద్ర కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, సీనియర్ నాయకులు వరికూటి నాగరాజు పాల్గొన్నారు.

'రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం'


టీడీపీలో చేరినవారితో ముక్కా సాయి వికాస్ రెడ్డి

రైల్వేకోడూరు రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్య మని రైల్వేకోడూరు టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వడ్డిపల్లికి చెందిన 50 కుటుం బాలు ఆకేపాటి సుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి పట్టుదల చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరామరాజు, సిద్ధేశ్వర తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ మురళీధర్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

'కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు'

లక్కిరెడ్డిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి); విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చుని సర్వశిక్ష అభియాన్ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు తెలిపారు. ఆదివారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వంటగది, స్టోర్‌రూం, విద్యార్థులు ఉండే వసతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో చదివే ఇంటర్, పదో తరగతి విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలుస్తున్నారని, చాలా మంది బాలికలు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు కూడా అయ్యారన్నారు. మార్చిలో జరగబోవు పబ్లిక్ పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎస్‌ఏ1 పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, శ్వేత, హిమశైలజ, యార్తమ్మ, శ్రీలక్ష్మి, దీప్తి, పద్మజ, ఇందిర, రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

రైల్వేకోడూరురూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షిం చాలని ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్, సహ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏపీఎండీసీ జేఏసీ పోరాట సమితి కన్వీనర్ ఆర్.వెంకటేష్ ధర్నా చేశారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి తమ సిద్ధాంతాలను అమలు చే స్తోందని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జాన్ ప్రసాద్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గణతంత్ర వేడుకల్లో నూలివీడు విద్యార్థుల ప్రతిభ

గాలివీడు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవం వేడుకల్లో నూలివీడు హైస్కూల్ విద్యార్థులు పాల్గొని పరేడ్‌లో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, రాయచోటి పట్టణం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నూలివీడు హైస్కూల్ విద్యార్థులు పరేడ్‌లో అత్యంత ప్రతిభ కనబరచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. భారత స్కౌట్ అండ్ గైడ్స్ తరపున రాయలసీమ జోన్ నుంచి రాష్ట్ర స్థాయిలో గైడ్స్ వైష్ణవి, గీతామాధురి స్కౌట్ నరసింహ, గణేశ్, జిల్లా స్థాయిలో గైడ్స్ లత, పల్లవి, శైలజ, షిరీంతాజ్, అర్చన, స్రవంతి, హోమలక్ష్మి, స్కౌట్స్ మహమ్మద్ రఫీ, భరత్, యాదగిరి ఆచారి, చిన్న కుళ్లాయప్ప ప్రతిభ కనపర్చారు. ఆయా విద్యార్థులు, స్కౌట్ మాస్టర్ కరకోటి చంద్రశేఖర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అభినందించారు.

అక్రమ కట్టడాల తొలగింపు

సిద్దవటం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాఖరాజుపల్లెలో 12 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను శనివారం రాత్రి రెవెన్యూ సిబ్బంది తొలగిం చారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శివశంకర్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.


అక్రమ కట్టడాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

నిత్యపూజ కోనలో 'స్వచ్ఛతే సేవ'

సిద్దవటం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజేశ్వర కోనలో ఆదివారం గుడివాడకు చెందిన సుముఖి అన్నపూర్ణేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు 170 మంది ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజి అధికారులు, ఎండోమెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడపలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది



విశ్వేశ్వరనాయుడు, డీఆర్ఓ, కడప | వెండిపతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి | జాన్ ఇర్విన్, కడప ఆర్డీఓ | చంద్రమోహన్, ఆర్డీఓ, బద్వేల్ | సాయిశ్రీ ఆర్డీఓ, జమ్మలమడుగు | చిన్నయ్య ఆర్డీఓ, పులివెందుల | వెంకటపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | ఓబులమ్మ, జడ్పీ సీఈఓ | ఆనందనాయక్, డీఆర్డీఏ పీడీ



ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ | ఎ.నాగేశ్వరరావు, డీఏఓ | రాజ్యలక్ష్మి డీపీఓ | నాగరాజు, డీఎంహెచ్ఓ | శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ | వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ | విజయలక్ష్మి, ఆత్మ పీడీ | రాజారత్నం, హౌసింగ్ పీడీ | చాంద్‌బాషా, పరిశ్రమల శాఖ | వై.సురేష్‌రెడ్డి, మెప్మా పీడీ | సరస్వతి, డీడీ సోషల్ వెల్ఫేర్



చాముండేశ్వరి, డీఎస్ఓ | ఎ.సురేష్, ఉపాధి అధికారి | పరిమళ జ్యోతి మార్క్‌ఫెడ్ | బ్రహ్మయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ | జయసింహా, బీసీ కార్పొరేషన్ ఈడీ | సి.సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ | మనోజ్‌రెడ్డి, కడప కమిషనర్ | జీవన్‌చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కలెక్టరేట్ | ఎ.శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | బి.శివరామిరెడ్డి, తహసీల్దార్, కమలాపురం | గంగయ్య, తహసీల్దార్ ప్రొద్దుటూరు



నాగేశ్వరరావు, తహసీల్దార్, సీకేదిన్నె | రాజేంద్రప్రసాద్, మైదుకూరు డీఎస్పీ | వెంకటేశ్వర్లు, జమ్మలమడుగు డీఎస్పీ | వినయ్‌కుమార్‌రెడ్డి, సీఐ, డీసీఆర్‌బీ | ఉలసయ్య, సీఐ, ఆర్‌కే వ్యాలీ | నాగభూషణం, సీఐ, బద్వేలు రూరల్ | మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ | సీతారామిరెడ్డి, సీఐ, రిమ్స్ | శివశంకరనాయక్, సీఐ, సీకేదిన్నె | ఎంవీ ప్రభాకర్‌రావు, సహకార శాఖ అధికారి | ధనుంజయ, డీఆర్‌డీఏ, కడప

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాయచోటిలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది



మేఘస్వరూప్, సబ్ కలెక్టర్, మదనపల్లె | నిధియాదేవి, సబ్‌కలెక్టర్, రాజంపేట | ఎ.శ్రీనివాస్, ఆర్డీవో, రాయచోటి | ఎస్.రమ హెచ్ఎన్ఎస్ఎస్, పీలేరు | అనిల్‌కుమార్ ఫైర్ ఆఫీసర్ | భరత్‌కుమార్ సర్వే ఏడీ | వెంకటరత్నం పీడీ, డ్వామా | టి.తేజస్విని, ఏడీ, ట్రైబల్ వెల్ఫేర్



దయాకర్‌రెడ్డి ఎస్ఈ, పీఆర్ | భరత్, ఎస్ఈ ఇరిగేషన్ | మధుసూదన్‌రావు డీఆర్‌వో | సీహెచ్ పురుషోత్తం డీపీఆర్‌వో | కృష్ణారావు ఇండస్ట్రియల్ ఆఫీసర్ | సుబ్రహ్మణ్యం ఏడీ, మైనింగ్ | జి.ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ | పి.రాము ఆర్ఎం, ఆర్టీసీ | నాగభూషణం ఏడీ, టూరిజం | ఆంజనేయులు ఎల్డీఎం | జవహర్‌బాబు ఎంపీడీవో, గాలివీడు



చంద్రానాయక్ జేడీ, అగ్రికల్చర్ | భరత్‌కుమార్‌రెడ్డి డీఈ ఐఅండ్‌పీఆర్ | రవిచంద్ర ఏడీ, హార్టికల్చర్ | నాగభూషణం ఏవో, కలెక్టరేట్ | విశ్వనాథ్ ఏడీ, ఎండోమెంట్ | నరసింహకుమార్ సూపరింటెండెంట్, కోఆర్డినేషన్ | సహదేవరెడ్డి ఎస్ఈ, ఆర్అండ్‌బీ | ఖలందర్ కలెక్టర్ సీసీ | రవి, వీడియోగ్రాఫర్ ఐఅండ్‌పీఆర్ | ద్రోణాచరణ్ ఫొటోగ్రాఫర్, ఐఅండ్‌పీఆర్ | రాజారమేష్ ఎస్బి సీఐ



కృష్ణమోహన్ డీఎస్పీ, రాయచోటి | చంద్రశేఖర్ సీఐ | కొండారెడ్డి సీఐ, లక్కిరెడ్డిపల్లె | నరసింహారెడ్డి, ఎస్ఐ, రాయచోటి అర్బన్ | వరప్రసాద్, సీఐ, రాయచోటి రూరల్ | జావీద్, ఎస్ఐ, రాయచోటి అర్బన్ | పీర్‌మున్ని తహసీల్దార్, రాజంపేట | రామాంజనేయులు తహసీల్దార్, రామాపురం | నిర్మలాదేవి, తహసీల్దార్, రామసముద్రం | ధనంజేయులు తహసీల్దార్, నిమ్మనపల్లె | సైకం వంశీ డీటీ, రాయచోటి

కన్నుల పండువగా అట్ హోమ్

కడప కలెక్టరేట్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ బంగ్లా ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో కన్నుల పండువగా అట్ హోమ్ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ శ్రీధర్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, నగరపాలక కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డిలు పాల్గొనగా వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా పురప్రజలకు, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన కళలైన జానపదాలు, భరత నాట్యాలు, జాతీయ భక్తిగీతాలు అట్ హోమ్ కార్యక్రమంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేద్దామన్నారు. విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి రాష్ట్ర అభివృద్ధిలో వైఎస్సార్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులను, వారి కుటుంబ సభ్యులను పలకరించి పరిచయం చేసుకున్నారు. తదనంతరం కళాకారులందరికీ కలెక్టర్, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. అట్ హోమ్ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని ఉల్లాసంగా గడిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అందరినీ ఆకట్టుకున్న వ్యవసాయ, మత్స్యశాఖ శకటం

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు వికసిత్ భారత్-వికసిత ఆంధ్ర-2047 ధైర్య సాహసాల ప్రదర్శన దేశభక్తిని ప్రేరేపించి అందరినీ ఆకట్టుకుంది. సుండుపల్లె కేజీబీవీ పాఠశాల విద్యార్థులు రంగీలా... రంగీలా అంటూ చేసిన బృంద ప్రదర్శన, అదే పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాడుదామా స్వేచ్ఛా గీతం ఎగరేయుదమా జాతీయ పతాకం నృత్యాలు ఆకట్టుకున్నాయి. మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థినులు ఘర్ ఘర్ తరంగా.. హర్ ఘర్ తిరంగా పాటకు చేసిన బృంద నాట్యం హుషారు కలిగించింది. గ్యారంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు పంతం పంతం.. సొంతం సొంతం సీదా నాదా సై అంటూ చేసిన నృత్యం దేశభక్తిని చాటుకున్న సైనికుల త్యాగాలను గుర్తు చేశాయి. కలకడ కేజీబీవీ పాఠశాల వారు జయహో.. జయహో అంటూ చేసిన బృంద ప్రదర్శన, రాయచోటి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు వందేమాతరం పాటకు చేసిన నృత్యాలు హుషారు గొలిపి దేశభక్తిని, సైన్యంలో మహిళలు చూపుతున్న ధైర్యసాహసాలను చాటింది. రాయచోటి గిరిజన గురుకుల పాఠశాలకు ప్రథమ బహుమతి, సుండుపల్లె కేజీబీవీ పాఠశాలకు ద్వితీయ బహుమతి, మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ వారికి తృతీయ బహుమతి, కలికిరి సైనిక్ స్కూల్ పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేశారు.

ఆకట్టుకున్న శకటాలు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా 2047 స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక 10 సూత్రాలపై అవగాహన కలిగించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రగతి శకటాలను ప్రదర్శించాయి. ఇందులో... గ్రేహౌండ్ బృందం, వజ్ర, మైన్ ప్రొటెక్టెడ్ వాహనాలు, రవాణాశాఖ వాహనం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ప్రణాళిక, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గృహ నిర్మాణ సంస్థ వాహనం, పరిశ్రమలు, పర్యాటకశాఖ వాహనం, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వాహనం, అటవీ, జలవనరులశాఖ వాహనం, జిల్లా పంచాయతీశాఖ వాహనం, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వాహనం, ఉద్యాన శాఖ, సూక్ష్మ నీటి సాగు శాఖ వాహనం, రాయచోటి పుపాలక సంఘం వాహనం, సర్వేశాఖ వారి రియల్ టైం గవర్నెన్స్ శకటం, విద్యాశాఖ, సమగ్ర శిక్ష వాహనం, 108, 104 వాహనాలు శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.



ద్వితీయ బహుమతి అందుకుంటున్న కేజీబీవీ పాఠశాల విద్యార్థులు

కడప పోలీసు పరేడ్‌లోని దృశ్యాలు



జెండాతో ఓ చిన్నారి ఆనందోత్సాహం



'ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం'లో భాగంగా ప్లాస్టిక్ భూత వేషధారణలో కడప నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుడు



డ్రోన్ల విన్యాసం

వేధిస్తున్న యూరియా కొరత

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- రైతుల తాకిడికి తట్టుకోలేక గోడౌనుకు తాళాలు



ఉప్పరపల్లె గోడౌను వద్ద యూరియా కోసం ఎగబడ్డ రైతులు

చెన్నూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీ సీజనులో వరిసాగు చేసిన రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. వరి సాగుకు అవసరమైన యూరియా లభ్యం కాకపోవడంతో ఉన్నదాంతోనే సరిపెట్టుకోవాలని అధికారులు చెప్పడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులపై మండిపడుతున్నారు. రెండువారాల క్రితం మండలానికి యూరియా మంజూరు కాగా.. వ్యవసాయ సిబ్బంది రైతులు కోరినంత మేర పంపిణీ చేశారు. యూరియా తీసుకున్న రైతులు పలువురు వాటిని ఇళ్లల్లో నిల్వ పెట్టుకోవడం, కొందరు బస్తాపై రూ.60, 70కి అదనంగా అమ్ముకోవడం జరిగింది. దీంతో అవసరం ఉన్న కొందరు రైతులు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, రెండురోజుల క్రితం రెండో దఫా మండలానికి మరో వంద టన్నుల యూరియా మంజూరైంది. ఇది చెన్నూరుకు 20టన్నులు, ఉప్పరపల్లె 20, రామనపల్లెకు 10, బయనపల్లె 10, కనుపర్తి 20, గ్రుర్రంపాడుకు 20 టన్నులు వచ్చింది. అయితే అధికంగా వరి సాగుచేసిన ఉప్పరపల్లె, చిన్నమాచుపల్లె రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఆదివారం ఉదయం ఉప్పరపల్లె గోడౌను వద్ద పలువురు రైతులు తమకు కావాలసిన మేర యూరియా ఇవ్వాలని పట్టుబట్టారు. వ్యవసాయాధికారులు తమ వద్ద ఎంత స్టాకు ఉందో దాన్ని ఎకరాకు బస్తా చొప్పున పంపిణీ చేస్తామనడంతో కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న దఫా ఇష్టానుసారం యూరియా తీసుకెళ్లిన రైతులే ఇప్పుడు మళ్లీ అడుగుతున్నారని.. మా పరిస్థితి ఏంటని, మేం ఎక్కడికి వెళ్లి తెచ్చుకోవాలని రైతులు అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. తమకు అవసరమైన యూరియా ఇవ్వాలని గట్టిగా నిలిదీయడంతో సమస్య తీవ్రతరమవుతుందని భావించిన సిబ్బంది గోడౌనుకు తాళాలు వేసి సోమవారం పంపిణీ చేస్తామని చెప్పి వెళ్లారు.



రైతులందరికీ పంపిణీ చేయాలి

మేం అడిగిన మేర యూరియా ఇవ్వడం లేదు. ముందు దఫా ఇష్టానుసారం యూరియా తీసుకెళ్లిన రైతులే మళ్లీ తీసుకెళుతున్నారు. మా పరిస్థితి ఏంటి, వ్యవసాయాధికారులు మా అవసరం గుర్తించి రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలి

- చింతకుంట నారాయణరెడ్డి, రైతు, ఉప్పరపల్లె



ఎక్కువ ధరకు తెచ్చుకుంటున్నాం

అవసరమైన యూరియా అందుబాటులో లేక లావు యూరియాను బయట ఎరువుల అంగళ్లల్లో తెచ్చుకుంటున్నాం, సన్న యూరియా ఇస్తే సర్దుబాటు అవుతుంది. గోడౌన్ వద్ద పరిస్థితి ఘోరంగా ఉంది. ఒక్కొక్కరు పదుల కొద్దీ బస్తాలు తీసుకెళుతున్నారు. మాలాంటి ఎకరా, రెండు ఎకరాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- రామసుబ్బారెడ్డి, రైతు, బుడ్డాయపల్లె

రైతుల అవసరం మేర పంపిణీ చేస్తున్నాం...



రైతులను ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశ్యం కాదు. మండలానికి వంద టన్నులు వచ్చింది. ఆయా గ్రామాల్లో రైతులకు ఏ మేర అవసరమో పంపిణీ చేస్తున్నాం. రైతులు గొడవ పెడితే ఎలా.. పై అధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నాం

- శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి

బ్రహ్మంగారి సన్నిధిలో విదేశీయుల సందడి



బ్రహ్మంగారిమఠం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారి మఠంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని ఆదివారం ఫ్రాన్స్, బెల్జియం దేశాలకు చెందిన 28 మంది విదేశీయులు దర్శించుకున్నారు. వీరికి ముందుగా పోలీసులు స్వాగతం పలికారు. అనంతరం దేవదాయశాఖ సిబ్బంది ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం విదేశీయులు దేవస్థానంలోని బ్రహ్మంగారి నివాస స్థలం, రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్యమఠంను సందర్శించారు. వీరి వెంట కానిస్టేబుల్ సూర్యనారాయణరెడ్డి, దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నిరసన కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

రాయచోటి టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన దేశ ప్రధాని నరేంద్రమోదీ నేటికీ ఆ హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ రైతు, కార్మిక వర్గాలకు నష్టం కలిగిస్తున్న పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సీఐటీయూ నాయకులు పీఎల్ నరసింహులు, అబ్బవరం రామాంజులు, ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, నాయకులు చెన్నయ్య, అరుణ, మాధవయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, రైతు సంఘం ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు రమణ, డాక్టర్ కేవీఎస్ నాయుడు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చూడవద్దన్నందుకు బాలిక ఆత్మహత్య



విద్యార్థిని శ్రావ్య మృతదేహం

రాజంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సెల్‌ఫోన్ చూడవద్దన్నందుకు ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. రాజంపేట పట్టణం సాయినగర్‌లో శ్రీనివాసులు ఆచారి, భార్య సిద్దేశ్వరిలు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు మగ పిల్లలు కాగా శ్రావ్యకుమారి మూడో సంతా నం(15). ఆ బాలిక రాజంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 9వ తరగతి చదువుతోంది. శ్రావ్యకుమారి తరచూ సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తూ ఉండేది. దీంతో ఆమె తల్లి సెల్‌ఫోన్ ఎక్కువగా చూడవద్దని, ఆరోగ్యం దెబ్బతింటుందని గట్టిగా మందలించింది. దీంతో శ్రావ్య మనస్థాపానికి గురై స్నానానికి బాత్‌రూం వెళుతున్నాని చెప్పి బెడ్‌రూంకు గడియ పెట్టుకుని లోనికి వెళ్లింది. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో శ్రావ్య తల్లి కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి బాలికను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఢీ - చిన్నారి దుర్మరణం



చిన్నారి మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు

నిమ్మనపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో రెండేళ్ల చిన్నారి దుర్మరణం చెందింది. ఎస్‌ఐ తిప్పేస్వామి కథనం మేరకు... కొండయ్యగారిపల్లి వాసి ఉప్పునేళ్ల సురేష్, పవిత్ర రెండో కుమార్తె గానవి(2) ఇంటి వద్ద ఆడుకుంటోంది. అదే గ్రామానికి చెందిన రెడ్డిబాషా ఖాన్ తన ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుతూ వచ్చి చిన్నారి మీద ఎక్కించాడు. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు స్థానిక అస్పత్రికి తరలిం చగా డాక్టర్ పరిశీలించి చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహంతో కుటుంబీకులు, గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. వెంటనే పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ రెడ్డి బాషాఖాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా అస్పత్రికి తరలించారు.

ప్రేమపేరుతో మోసం..యువకుడిపై కేసు

కాశినాయన, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో నమ్మించి మోసం చేసిన చంద్ర అనే యువకుడిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. మండలంలోని బాలాయపల్లె గ్రామానికి చెందిన చంద్ర ఓ యువతిని ప్రేమపేరుతో నమ్మించాడు. పెండ్లిచేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. తీరా ఆయువతి పెండ్లి చేసుకోమని కోరడంతో నిరాకరించాడు. ఈవిషయంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జంగావారిపల్లెలో మహిళ హత్య

కురబలకోట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగావారిపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం రత్నమ్మ(35) అనే మహిళ హత్యకు గురైంది. వివరాలిలా.. మండంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు కర్నాటక రాష్ట్రం చేలూరుకు చెందిన రత్నమ్మ(35)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఎస్సీ కాలనీలో కాపురం ఉంటున్నారు. కాగా వీరివురు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. శనివారం రాత్రి ఇరువురు మద్యం సేవించి గొడవపడ్డారు. దీంతో కోపోద్రేకానికి గురైన శ్రీనివాసులు కర్రతో కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో దొంగతనాలు

ఖాజీపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె, సిద్దాంతిపురం గ్రామాల్లో చోరీలు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున భూమాయపల్లె సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం, సిద్దాంతిపురం రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భీమలింగేశ్వర ఆలయంలో సంవత్సరంలోపు ఎనిమిదిసార్లు దొంగతనం జరుగడంతో భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మోహన్ మాట్లాడుతూ భీమలింగేశ్వర ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డబ్బులు మాత్రం హుండీలో లేవని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సిద్దవటం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కడప- బద్వేలు రహదారి ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షరాభి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆ రహదారి గుండా వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గమనించి స్థానిక వైద్యశాలకు చికిత్సకు తరలించారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగాలి

- సీఆర్పీఎఫ్ డీజీ అనుపమ్ శర్మ



సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో జాతీయ జెండా వందనం చేస్తున్న అనుపమ్ శర్మ

కలికిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు, భద్రతకు అతి పెద్ద ముప్పుగా పరిణమించిన నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగించాల్సి వుందని స్థానిక సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని ఉగ్రవాద వ్యతిరేక, తీవ్రవాద నిరోధక శిక్షణా సంస్థ (సీఐఏటీ-3) ప్రిన్సిపాల్, డీజీ అనుపమ్ శర్మ పున రుద్ఘాటించారు. ఆదివారం సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో నిర్వ హించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా మొదట ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి పతాక వందనం చేశారు. అంతకు ముందు ప్రాంగణంలోని క్వార్టర్ గార్డ్ వద్ద అమర వీరుల స్మారక చిహ్నానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అనుపమ్ శర్మ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వం కోసం సీఆర్పీఎఫ్ అనేక త్యాగాలకు సిద్ధమైందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఆర్పీఎఫ్ సైనికులు పొందిన రాష్ట్రపతి పోలీసు పతకం, శౌర్య చక్ర తదితర పురస్కారాల వివరాలను చదివి వినిపించారు. స్థానిక సైనిక పాఠశాలలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

177 పరుగుల ఆధిక్యతలో ఆంధ్రా జట్టు

కడప స్పోర్ట్స్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో శనివారం నుంచి ఆంధ్రా-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అండర్- 23 మల్టీడేస్ నాలుగురోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం ఆంధ్రా జట్టు 177 పరుగుల ఆధిక్యతలో నిలిచింది. వివరాలిలా.... తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. కాగా ఆట రెండవ రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 45.1 ఓవర్లలో కేవలం 119 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 85 పరుగులతో సాగుతోంది.

కువైట్ టు కొండూరు..

- స్నేహితుడి ఇంటికి అరబ్ షేక్



అట్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామానికి ఆదివారం తన స్నేహితుడైన అట్లూరు రాజగోపాల్‌ను చూడడానికి కువైట్ షేక్ అబ్దుల్ రహిమాన్ యూసఫ్ వచ్చారు. రాజగోపాల్ 15 సంవత్సరాలుగా కువైట్‌లో తనతో ఎంతో స్నేహంగా, నమ్మకంగా ఫ్యామిలీలో ఒకడిగా ఉండేవారు. దీంతో స్నేహితుని పిలుపు మేరకు ఇక్కడకు వచ్చినట్లు షేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కొండూరు గ్రామ ప్రజలు తప్పెట్లు, మేళాలతో ఘనస్వాగతం పలికారు.

లాయర్‌పై దాడి...

రైల్వేకోడూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టోల్‌గేటు వద్ద ఉన్న మొబైల్ షాపు దగ్గర లాయర్ కస్తూరి సురేష్ కారు పార్కింగ్ చేస్తుండగా తమ దుకాణం వద్ద పార్కింగ్ చేయవద్దని షాపు యజమాని చెప్పాడు. ఈవిషయమై ఇరువురు ఘర్షణ పడ్డారు. దీంతో షాపు యజమాని బంధువులు లాయర్‌పై దాడి చేశారు. ఈ సంఘటనపై లాయర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి ఘన సన్మానం



బాలయల్లారెడ్డిని సన్మానిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్, కమిషనరు మనోజ్‌కుమారరెడ్డి

చెన్నూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు పెద్దబల్లె బాలయల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, నగర కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు సరస్వతిలు ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి సన్మానించారు. ఈసందర్భంగా సమరయోధుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు అందరూ స్వేచ్ఛగా అనుభవించాలన్నారు. డీటీ వెంకటరమణ, మండల సర్వేయరు సోమశేఖర్, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ



కడప కలెక్టరేట్ జనవరి 26(ఆంధ్రజ్యోతి) 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆదివారం జాతీయ పతాకాన్ని కలెక్టర్ డాక్టర్ చెరుకూరు శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులను ఎదిరించి ప్రాణ త్యాగాలు చేసి అమరులైన జాతీయనాయకులు, సమర యోధుల త్యాగాలను కలెక్టర్ కొనియాడారు. జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం





ప్రమాదంలో మృతి చెందిన ఫయాజ్‌అలీ, మహేంద్ర

బి.కొత్తకోట జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్ బాబు తెలిపిన వివరాల మేరకు....

రాయచోటికి చెందిన ఫయాజ్‌అలీ (30), మహేంద్ర (25) ఓ టెంపోలో పీటీఎం మండలం రంగసముద్రం సమీపంలోని ఓ ఫౌల్ట్రీ ఫారం నుంచి కోళ్లను తీసుకెళ్లేందుకు వచ్చారు. టెంపోలో కోళ్లను వేసుకుని ములకలచెరువు మండలం పెద్దపాళ్యం క్రాస్ మీదుగా హైవేలో ప్రవేశించి అంగళ్లు వైపునకు వెళుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున కోటిరెడ్డిగారిపల్లె వద్ద కదిరి నుంచి మదనపల్లె వైపు వెళుతున్న లారీ నిలిపి ఉండగా దానిని ఢీకొన్నారు. అతివేగంతో వెళుతున్న టెంపో లారీ వెనుక వైపు నుంచి ఢీకొనడంతో టెంపో ఇరుక్కుపోయింది ఈ ఘటనలో టెంపో నడుపుతున్న డ్రైవర్, సహాయకుడు ఫయాజ్‌అలీ, మహేంద్రలు అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఎక్స్‌కేవటర్ సహాయంతో లారీలో ఇరుక్కుపోయిన టెంపోను విడదీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు’

లక్కిరెడ్డిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సర్వశిక్ష అభియాన్ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు తెలిపారు. ఆదివారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వంటగది, స్టోర్‌రూం, విద్యార్థులు ఉండే వసతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో చదివే ఇంటర్, పదో తరగతి విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలుస్తున్నారని, చాలా మంది బాలికలు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు కూడా అయ్యారన్నారు. మార్చిలో జరగబోవు పబ్లిక్ పరిక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎస్ఏ1 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, శ్వేత, హిమశైలజ సిబ్బంది పాల్గొన్నారు.

మూలవంక బ్రిడ్జి మూసివేత

సికెదిన్నె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మూలవంక పాత బ్రిడ్జిని అధికారులు ఆదివారం మూసేశారు. బ్రిడ్జి నిర్మించి 100 ఏళ్లు పూర్తయిందని, బ్రిడ్జి నాణ్యతను పరీక్షించి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మూసేసినట్లు ఈఈ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవని, ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరుగకుండా ఉండాలని బ్రిడ్జిని మూసివేస్తున్నట్లు తెలిపారు. కాగా ఓ ప్రముఖ వెంచర్ నిర్వాహకులు అడ్డగించడంతో పోలీసు రక్షణలో గోడను కట్టి బ్రిడ్జిని మూసివేశారు.

ప్రశాంత్‌నగర్‌లో సమస్యల తిష్ఠ

● పేరుకే ప్రశాంతం.. సౌకర్యాలు అరకొర
● రోడ్లు, కాలువలే ప్రధాన సమస్య
● విద్యకు నిలయం ట్రాఫిక్ వలయం

ప్రశాంతతకు నిలయంగా పేరొందిన మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్‌నగర్ అది. ఈ పేరును బట్టే మదనపల్లెకు ప్రశాంతత వచ్చిందేమో అనిపిస్తుంది. మధ్యతరగతి, సంపన్నవర్గం నివసించే ప్రాంతం. ముఖ్యంగా పట్టణంలోకెల్లా ఎక్కడా లేని విధంగా విద్యాలయాలకు నిలయంగా మారిన ఏరియా కూడా. నర్సరీ పాఠశాలల నుంచి డిగ్రీ కళాశాలల వరకూ అన్నీ ఇక్కడే ఉన్నాయి. అలాగే ఉద్యోగులు, పదవీవిరమణ చేసిన వారు ఎక్కువగా ఇక్కడే నివాసం ఉంటారు. అలాంటి ప్రాంతం సమస్యలకు నిలయంగా మారిందంటే అతిశయోక్తి కాదు. కదిరిరోడ్డు ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ఏరియాలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి.


ప్రశాంత్‌నగర్ ప్రధాన ప్రవేశం

మదనపల్లె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో రెండు ప్రధాన రోడ్లతోపాటు 15 క్రాస్‌రోడ్లు ఉన్నాయి. వాటి అన్నింటిలోనూ రోడ్లు, కాలువలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షం వస్తే చాలు..మూడు ప్రధాన రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. మరోవైపు వాటి పరిధిలోని నివాసాలను వర్షపు నీరు ముంచెత్తుతోంది. కదిరి రోడ్డు వెంబడి టిప్పుసుల్తాన్ మైదానం నుంచి వచ్చే వర్షపునీరు ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీలను చుట్టుముడుతోంది. మద్దిమాను నుంచి వీరబ్రంహేంద్రస్వామి గుడి వరకూ రూ.58లక్షలతో పెద్ద డ్రైనేజీ కాలువ నిర్మించారు. ఇలాగే కదిరిరోడ్డు వెంబడి మద్దిమాను నుంచి పైవరకూ డ్రైనేజీని నిర్మించి వాటిని కలపాల్సివుంది. ఇప్పటికే నిర్మించిన పెద్దమురుగునీటి కాలువకు మధ్యలో అక్కడక్కడ మ్యాన్‌హోల్‌లు నిర్మించి కదిరిరోడ్డు నుంచి వచ్చే వర్షపునీటిని పెద్దకాలువకు కలపకపోవడంతో వర్షపునీరంతా పొంగి, ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడుకాలనీలను ముంచెత్తుతోంది. నీరుపోయే మార్గం లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

మురుగునీటి కాలువలు లేవు

ప్రశాంత్‌నగర్ ప్రధాన రోడ్డుకు అటు, ఇటు సగానికిపైగా మురుగునీటి కాలువలు లేవు. పై భాగంలో ఉన్నా.. ఒక దానికి ఒకటి లింకు లేకపోవడంతో కాలువలు నిండి వర్షపునీరు ఇళ్లలోకి వస్తోంది. మురుగునీరు రోడ్లపైకి, ఖాళీ జాగాల్లోకి ప్రవహిస్తోంది. మరోవైపు ప్రశాంత్‌నగర్‌లో రోడ్లు, కాలువలు దాదాపుగా మూడు దశాబ్దాల క్రితం నిర్మించినవే ఉన్నాయి. దీంతో నివాసాలు కిందకు ఉండగా, తర్వాత నిర్మించిన రోడ్లుపైకి ఉన్నాయి. దీంతో వర్షం వస్తే..ఆ నీరంతా కింది భాగంలోని ఇళ్లలోకి వెళ్తోంది. ఫలితంగా చాలా మంది ఇంటిముందు వర్షపు నీరు ప్రవేశించకుండా ప్రొటెక్షన్ గోడలు నిర్మించుకోవాల్సి వస్తోంది.

చెరువును తలపిస్తోంది

మరీ ముఖ్యంగా ప్రశాంత్ నగర్-9క్రాస్‌లో వర్షం వస్తే, నీరుపోయే మార్గంలేక చెరువును తలపిస్తుంది. అక్కడ ఇళ్లు నిర్మించే నాటికి సరిపోయే ఎత్తులో నిర్మించగా, తర్వాత రోడ్ల నిర్మాణంతో నివాసాలు కిందకు వెళ్లిపోయాయి. దీంతో ఎక్కడా లేని విధంగా 9క్రాస్‌లో నీరు నిలిచి వాహనాలే కాదు.. పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. అలాగే జ్ఞానోదయస్కూల్ మైదానం నుంచి కృష్ణారెడ్డి సిద్దార్థ కళాశాల వద్ద వర్షం వస్తే నీరు వెళ్లే మార్గంలోకి అక్కడా రోడ్డు జలమయమవుతోంది. మరోవైపు కాలువలు లేకపోవడంతో అక్కడి నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. గుంతలమయమైన రోడ్లతో పాటు పైపులు, ప్రైవేటు కేబుల్‌లైన్లు, కొళాయి కనెక్షన్ల కోసం ఉన్న రోడ్లు తవ్వేసి వాటిని సక్రమంగా పూడ్చకపోవడంతో గుంతలు పడి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.


కోమటివానిచెరువుకు సమీపంలోని కళాశాల ముందు రోడ్డుపైకి వస్తున్న నీరు

కుక్కల బెడద

ఉదయమే కాదు.. రాత్రులలోనూ స్థానికులకు కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది. అలాగే ప్రశాంత్‌నగర్‌కు ఆనుకుని ఉన్న సప్తగిరినగర్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. వీధుల్లోకి రావాలంటే జనం భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు వీధుల్లోకి వస్తే చాలు.. కుక్కలు వెంటపడుతున్నాయి.

ట్రాఫిక్ సమస్య

విద్యాలయాలకు నిలయంగా మారిన ప్రశాంత్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. నర్సరీ మొదలు డిగ్రీ కళాశాల వరకు విద్యాలయాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం పాఠశాలలకు వెళ్లడానికి, సాయంత్రం ఇంటికి వెళ్లడానికి ట్రాఫిక్ సమస్య ఉంటోంది. అన్ని పాఠశాలలు, కళాశాలలు ఒకేసారి వదిలేయడంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనాలు, స్కూల్స్, కళాశాలల బస్సులతో రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో అక్కడి నుంచి ప్రధాన రహదారికి వెళ్లే వరకు దాదాపు అరగంట సమయం పడుతోంది. మరోవైపు అదే సమయంలో బయటి స్కూల్స్, కళాశాలల బస్సులు కూడా ఇక్కడి విద్యార్థులను వదలడానికి ఎదురెదురుగా రావడం, అసలే ఇరుకురోడ్లు కావడంతో సమస్య జఠిలంగా వుంది. పైగా ఇక్కడి నుంచి మరోమార్గం నుంచి బయట పడదామంటే, మరోమార్గం ఉండటం లేదు. అక్కడంతా డెడ్‌ఎండ్ రోడ్లే ఉన్నాయి.

ఆకతాయిల బెడద

మరోవైపు ప్రశాంత్‌నగర్‌లో పాఠశాలలు, కళాశాలలు ఉన్న నేపథ్యంలో నాలుగు ప్రధాన రహదారుల్లో సాయంత్రం వేళలో ఆకతాయిల బెడద కూడా అధికంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వీధుల్లో ఎక్కడ చూసినా యువత, విద్యార్థులు రోడ్ల పక్కన, చెట్ల కింద గుంపులుగా ఉంటున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలలో స్పీడ్ రైడింగ్‌తో హారన్ మోగిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారు. అలాగే యువత గ్రూపులుగా ఏర్పడి, వివాదాలకు దిగడం, ఘర్షణలు కూడా ఈ ప్రాంతంలో నిత్యకృత్యమయ్యాయి. ఉదయం 9గంటలకు పాఠశాలల వేళ, సాయంత్రం వేళ అక్కడ పోలీసుల నిఘా ఉన్నప్పటికీ ఆకతాయి చేష్టలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు.


సిద్దార్థ, శ్రీచైతన్య స్కూల్‌కు వెళ్లే రహదారిలో దుస్థితిలో మురుగునీటి కాలువ

ప్రశాంత్‌నగర్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి..



ప్రశాంత్‌నగర్ అంటే పట్టణంలో ప్రత్యేక స్థానం ఉంది. ఆ స్థాయిలో ఇక్కడి ప్రజలకు సౌకర్యాలు, వసతులు కల్పించాలి. ముఖ్యంగా విద్యాలయాలకు నిలయంగా మారిన ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ఇక్కడి సమస్యలు సానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడున్న పాతరోడ్లు, కాలువల స్థానంలో కొత్తగా రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.2కోట్ల ప్రతిపాదనలు పంపారు. త్వరలో అవి కార్యరూపం దాలుస్తాయని ఆశిస్తున్నాం.

- డి.భాస్కర్, టీడీపీ నాయకుడు, ప్రశాంత్‌నగర్


ప్రశాంత్‌నగర్ నుంచి జ్ఞానోదయస్కూల్ గ్రౌండ్‌కు వెళ్లే ఆకతాయిలకు అడ్డాగా ఉండే రహదారి

40ఏళ్ల నాటి రోడ్లు, కాలువలే..



ప్రశాంత్‌నగర్‌లో ఎప్పుడో 30-40 నాటి రోడ్లు, కాలువలే ఎక్కువగా ఉన్నాయి. తర్వాత అక్కడక్కడ నిర్మించిన రోడ్లు ఎత్తుగా వేయడంతో నివాసాలు చాలా చోట్ల కిందకు వెళ్లిపోయాయి. అయినా ఇప్పటికీ రోడ్లు, కాలువ సమస్యలే ఇక్కడి ప్రజలకు ఇబ్బందిగా మారింది. అలాగే అప్పటి జనాభా, రద్దీకి అనుగుణంగా వీటిని నిర్మించారు. ప్రస్తుతం జనాభాతోపాటు ఇక్కడ విద్యాలయాలు ఎక్కువగా ఉన్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వీటి పరిష్కారానికి పాలకులు, అధికారులు చొరవచూపాలి.

- కె.వెంకటరెడ్డి, ప్రశాంత్‌నగర్

రోడ్లు, కాలువల వ్యవస్థను సరిచేయాలి..



మా ప్రశాంత్‌నగర్‌కు ఉన్న పేరు తరహాలో సౌకర్యాలు లేవు. ముఖ్యంగా రోడ్లు, కాలువల వ్యవస్థను సమీక్షించాలి. ప్రధానంగా మురికినీటి కాలువలను అనుసంధానం చేయాలి. పైభాగం నుంచి కింద వరకూ డ్రైనేజీ సక్రమంగా వెళ్లేలా వ్యవస్థను పునరుద్ధరించాలి. వర్షం వచ్చిందంటే రాత్రిల్లో మాకు నిద్ర ఉండదు. కదిరిరోడ్డులోని వర్షపునీరంతా ప్రశాంత్‌నగర్‌లోకి వచ్చేస్తుంది. ప్రధాన రహదారి వెంట పెద్దకాలువ నిర్మించినా..వర్షపునీరు వెళ్లే ఏర్పాటు చేయలేదు. ఇక రాత్రివేళ చెప్పుకోలేని సమస్య ఉంది. అదే కుక్కల బెడద. వాటి నుంచి మాకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటి నివారణకు చర్యలు చేపట్టాలి.

- ఎస్.రవీంద్రనాథ్‌నాయుడు, ప్రశాంత్‌నగర్

రోడ్ల తవ్వకాలతో ఇబ్బందులు..



రోడ్ల తవ్వకాలతో ఇబ్బందులు పైపులైన్లు, కొళాయి కనెక్షన్లు, కేబుల్ కోసం రోడ్లు అక్కడక్కడ తవ్వి మట్టితో పూడ్చేశారు. తర్వాత వర్షంతో మట్టికొట్టుకుపోయి గుంతలు అలాగే ఉన్నాయి. దీంతో వాహనదారులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాయి. రోడ్లు, కాలువలు అక్కడక్కడ దెబ్బతిని గుంతలు ఏర్పడగా, కాలువలోని మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. దీనికి స్థానికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా కాకుండా కొత్తగా రోడ్లు, కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎ.రాజేష్, ప్రశాంత్‌నగర్

రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం

ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి ● జాతీయ జెండాను ఎగురవేసిన సబ్‌కలెక్టర్


సబ్‌కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్




మున్సిపల్ కార్యాలయంలో జెండాకు వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల - తంబళ్లపల్లె సివిల్ కోర్టులో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ - భారత రాజ్యాంగం పుస్తకం పంపిణీ చేస్తున్న బాస్ నేతలు

మదనపల్లె/ మదనపల్లె టౌన్/మదనపల్లె అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ విలువలను కాపాడుకుందామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. ఆదివారం సబ్‌కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రతను, ఐక్యతను ప్రజలందరు నిలబెట్టాలన్నారు. మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, టిప్పు సుల్తాన్ మైదానంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల, కౌన్సిలర్లు, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజున ప్రజలందరూ ప్రజాస్వామ్య విలువలతో నడుచుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రెడ్డెమ్మ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కంచెర్ల శ్రీనివాసులునాయుడు, జడ్పీ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ భారత రాజ్యాంగాన్ని పంపిణీ చేయాలి

ప్రతి ఇంటికీ భారత రాజ్యాంగాన్ని పంపిణీ చేయాలని బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ అధి కారులను డిమాండ్ చేశారు. రాజ్యాంగం చదివితే కనీసం రాజ్యాంగం పట్ల విధేయత చూపుతారని, కొంతవరకైనా అవినీతి రహిత సమాజాన్ని చూడగలమన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని వీసీకే, బాస్ ఆధ్వర్యంలో బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పలువురికి రాజ్యంగం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, బాస్ నేతలు ముత్యాల మోహన్, పీర్‌బాషా, బయన్న, రవిశంకర్, గంగులు, రెడ్డెప్ప, తలారి కృష్ణ, రెడ్డిప్రసాద్, చంద్ర, జనార్దన్, ఇర్ఫాన్, శశికుమార్, రాజేజ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. జడ్పీహైస్కూల్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులకు విశ్రాంత డీజీపీ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందించారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, అజాద్ బహల్ ట్రస్టు సభ్యులు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, బ్రైడ్ ఇండియా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలి

నిమ్మనపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేశారు.

● తంబళ్లపల్లె, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర దినోత్సవాలను నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. తంబళ్లపల్లె సివిల్ కోర్టులో న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ జెండా వందనం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆయా అధికారులు, సచివాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు.

పీలేరులో...

పీలేరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా చేసుకున్నారు. సామాన్యుల దగ్గర నుంచి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు జాతీయ స్ఫూర్తితో ఊరూవాడా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, మాజీ సైనికుల కార్యాలయం, ఆర్టీసీ డిపో, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. మాజీ సైనికోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. పీలేరు కోర్టు ప్రాంగణంలో 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేశ్, సీనియర్ సివిల్ జడ్జి రవి, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆయా అధికారులు త్రివర్ణ పతాకం ఎగురవేశారు. డీవీఎంసీ సభ్యులు శ్రీనివాసులు, బోడేషావలి, పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీ అన్సారీ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రకుమార్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, కరస్పాండెంట్లు మాధవి, ఉమారమాదేవి, భార్గవి, నాయుడు, ఏఎస్ఓ రామ్మోహన్, పారా మిలటరీ అసోసియేషన్ నేతలు పీఎస్ ఖాన్, బీసీ రెడ్డప్ప, శ్రీనివాసులు, చంద్ర శేఖర్, రమణ బాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మెన్ ద్వారకనాథ్, విశ్వం విద్యాసంస్థలలో చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, గోల్డెన్ వ్యాలీలో కరెస్పాండెంట్ రమణారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.



సీటీఎం జడ్పీ హైస్కూల్‌లో జెండాకు వందనం చేస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

స్టాంపు వెండర్‌కు ఆర్థిక సాయం

మదనపల్లె, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న స్టాంపు వెండర్ ఎస్.అక్బర్‌బాషాకు సహచరులు రూ.68వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, స్టాంపురైటర్లు, వెండర్స్ సంయుక్తంగా అందజేశారు. సబ్‌రిజిస్ట్రార్ ఎం.గురుస్వామి, డాక్యుమెంట్ రైటర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంగేరి నందా, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రంగు రాజేంద్ర, రైటర్ల సంఘం అధ్యక్షుడు రంగు గుణశేఖర్ పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు

కలికిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహల్‌లో సర్వైకల్ క్యాన్సర్ పరీక్షల శిబిరం నిర్వహించారు. 204 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కత్తివారిపల్లె, ఆద్దవారిపల్లె, గుండ్లూరు పంచాయతీల నుంచి మహిళలు శిబిరానికి హాజరయ్యారు. సంజీవిని ఉమెన్ హెల్త్ కేర్ పేరిట కలికిరి మండలంలో వరుసగా సర్వైకల్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, శ్రీనివాస రెడ్డి, వైద్య నిపుణులు డాక్టర్ షమీమ్, డాక్టర్ జిలాని, షబ్బీర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో పూర్తయిన సామాజిక తనిఖీ

పీలేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ బాలికల గురుకులంలో మూడు రోజులుగా జరిగిన సామాజిక తనిఖీ ఆదివారం ముగిశాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలోని అన్ని గురుకులాల్లో విస్తృతంగా సామాజిక తనిఖీలో భాగంగా ఆదివారం డీఆర్పీలు రమేశ్, నరేశ్ గురుకులం విద్యార్థినులతో గ్రామసభ నిర్వహించారు. ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక వసతులు, భోజన నాణ్యత, పరిపాలన, ఆర్థిక అంశాలు, డైనింగ్ హాలు, పారిశుధ్యం, వసతి గృహం, మరుగుదొడ్ల శుభ్రత వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు. డైనింగ్ హాలు, వసతి గృహం, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంటు, క్రీడా మైదానాన్ని తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ జీబీ కరుణ, హెచ్‌ఎస్ ప్రమీల, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాస్పత్రిని ప్రైవేటు పరం కానివ్వం'

మదనపల్లె టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటు పరం కానివ్వమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. ఆదివారం బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ పార్టీల నేతలు పనిగట్టుకుని ప్రభుత్వాస్పత్రిని ప్రైవేటు పరం చేస్తారని విషప్రచారం చేస్తున్నారన్నారు. వీటిని ప్రజలు నమ్మవద్దన్నారు. వైసీపీ హయాంలో నిర్మించిన మెడికల్ కాలేజి భవనాల నిర్మాణంలో నాణ్యత లేదన్నారు. ప్రభుత్వం పీపీపీ విధానంతో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తెస్తుందన్నారు. ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు, రెండు సార్లు ఎంపీగా పనిచేసిన నేతలు మదనపల్లె అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రి, మెడికల్ కాలేజి నిర్మాణాలపై జరుగుతున్న విష ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే అన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, ఎస్ఏ మస్తాన్, టీడీపీ అధికార ప్రతినిధి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

జోరుగా మద్యం అమ్మకాలు ● పట్టించుకోని అధికారులు

ములకలచెరువు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్రం దినోత్సవం రోజే జోరుగా మద్యం అమ్మకాలు సాగాయి. దేశం మొత్తం గణతంత్ర దినోత్సవాలు చేసుకుంటుంటే ఇక్కడ మాత్రం మద్యం ఏరులై పారింది. గణతంత్ర దినోత్సవం రోజు మద్యం అమ్మకాలు చేపట్టరాదని ప్రభుత్వ ఆదేశాలున్నా ఇందుకు విరుద్ధంగా అమ్మ కాలు చేపట్టారు. ములకలచెరువులోని ఓ మద్యం దుకాణం వద్దే ఈ అమ్మకాలు చేపట్టడం శోచనీయం. మద్యం అమ్మకాలకు సంబంధించి వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. ఓ కంపెనీ మద్యం బాటిల్ ధర రూ.190 అయితే ఇక్కడ మాత్రం ఏకంగా రూ.250కి అమ్మారు. ఈ విషయం వీడియోల్లో రికార్డైంది. అన్ని బ్రాండ్ల మద్యం అమ్మకాలు అధిక ధరలకు విక్రయించారని మందుబాబులు చెబుతున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున మద్యం అమ్మకాలు జరగకుండా చూడాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీలేరు అధికారులకు ప్రశంసాపత్రాలు

పీలేరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు పీలేరులో పనిచేస్తున్న పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలు లభించాయి. ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి పీడియాట్రీషియన్ డాక్టర్ శివయ్య, ఎంపీఐ విజయ కుమారి, ఏపీపీ శారద, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్ర కుమార్ రెడ్డి, అసిస్టెంట్ డీఎం వెంకట సుబ్బమ్మ, అగ్నిమాపక శాఖాధికారి మస్తాన్, లీడింగ్ ఫైర్ మ్యాన్ శ్యామ్ ప్రకాశ్, ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహీ, మత్స్య శాఖ అధికారి మోహనకృష్ణ, ఏపీఎం జవహర్, ఎఫ్‌బీఓలు ప్రతాప్, కుప్పుస్వామి, నియోజకవర్గ ఈఆర్ఓ రమ, ఎంఈఓ లోకేశ్వర రెడ్డి, పోలీసు సిబ్బంది మహమ్మద్ సాధిక్, ద్వారకనాథ్, ఎక్సైజ్ కానిస్టేబుల్ రెడ్డిశేఖర్, హంద్రీ-నీవా కార్యాలయంలోని డీటీ ఇషాక్, కంప్యూటర్ ఆపరేటర్ శేషాద్రి, చెన్నకేశవ స్వామి ఆలయ అటెండర్ భాస్కర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగి మునిప్రసాద్ రెడ్డి, ట్రైబల్ స్కూల్ ఉద్యోగి లక్ష్మీపతి, ఎంపీడీఓ కార్యాలయ టైపిస్ట్ నవకాంత్ బాబు, వీఆర్వో కల్యాణి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిని స్థానిక అధికారులు అభినందించారు.

గంగులప్ప సేవలు మరువలేనివి

నిమ్మనపల్లి జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో గంగులప్ప సేవలు రైతులకు ఎంతగానో ఉపయోగ పడతాయని ప్రజాసంఘాల నేతలు అన్నారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో గంగులప్పను సన్మానించారు. ప్రజాసేవా సంస్థ అధ్యకుడు సహదేవ, కాంగ్రెస్ నేత రెడ్డిబాషా మాట్లాడుతూ గంగులప్ప ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈయన ప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సంక్రాతి రోజున వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ద్వారా ఉత్తమ అభ్యుదయ రైతుగా ఎంపిక చేసి సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణ, యర్రయ్య, శ్రీరాములు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.